




ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 322 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/- | మంగళవారం 24 జూన్ 2025

RNI No: APTEL/2023/87888 | Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


# పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుపై
## అనుమానాలను నివృత్తి చేయాలి:చంద్రబాబు

పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుపై తెలంగాణకు ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలని సీఎం చంద్రబాబు మంత్రులు, నేతలకు సూచించారు.

**అమరావతి, జూన్ 24, (రిపబ్లిక్ న్యూస్):** పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుపై తెలంగాణకు ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలని సీఎం చంద్రబాబు మంత్రులు, నేతలకు సూచించారు. ఈ ప్రాజెక్టు ద్వారా వరద జలాలే వాడుకుంటున్నట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణకు ఎలాంటి నష్టమూ లేదని అన్నారు. సచివాలయంలో రాష్ట్రమంత్రివర్గ సమావేశం ముగిసింది. మొత్తం 42 అజెండా అంశాలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అనంతరం రాజకీయ అంశాలపై చర్చించారు.



ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "తెలంగాణలో అనుమతులు లేకుండా ఎన్నో ప్రాజెక్టులు చేపట్టినా అభ్యంతరం చెప్పలేదు. పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుపై నేతలంతా మాట్లాడాలి. కేవలం రాజకీయం కోసమే తెలంగాణలో కొందరు అభ్యంతరాలు చెబుతున్నారు. ప్రజలకు వాస్తవాలు వివరించాల్సిన బాధ్యత మంత్రులు, నాయకులపై ఉంది." అని అన్నారు. అమరావతిలో మలివిడత భూసేకరణపై మంత్రివర్గంలో చర్చ జరిగింది. తొలివిడత నిబంధనలే మలివిడతకూ వర్తింపజేయాలని నిర్ణయించారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాలను ఇన్చార్జి మంత్రి నేతృత్వంలో జిల్లాస్థాయిలో నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. ఆ తర్వాత నియోజకవర్గ స్థాయిలో కార్యక్రమాల నిర్వహణకు ఆమోదం తెలిపారు. ఏడాదిలోగా రెవెన్యూ సమస్యలన్నీ పరిష్కరించాలని సీఎం తేల్చి చెప్పారు. సాంకేతిక సమస్యల సాకుతో దాటవేత ధోరణి సరికాదని, ఇబ్బందులుంటే తనతో మాట్లాడవచ్చన్నారు. రెవెన్యూ సమస్యలపై తరచూ అడుగుతూనే ఉంటానని గట్టిగా చెప్పారు. కూటమి ఏడాది విజయాలు ఇంటింటికీ తీసుకెళ్లే కార్యాచరణ రూపొందించామన్న సీఎం.. జులై 1 నుంచి ఎమ్మెల్యేలు ఆ బాధ్యత తీసుకోవాలన్నారు. అన్న క్యాంటీన్ల నిర్వహణ, విరాళాలకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని కేబినెట్ సమావేశంలో నిర్ణయించారు.

# మాజీ సీఎం జగన్‌పై మరో కేసు

మాజీ సీఎం జగన్ పై మరో కేసు నమోదైంది. గుంటూరు మిర్చి యార్డు పర్యటన పై పోలీసులు కేసు నమోదు చేశారు.

**గుంటూరు, జూన్ 24, (రిపబ్లిక్ న్యూస్):** మాజీ సీఎం జగన్ పై మరో కేసు నమోదైంది. గుంటూరు మిర్చి యార్డు పర్యటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈమేరకు వైకాపా నేతలకు నల్లపాడు పోలీసులు నోటీసులు ఇచ్చారు. ఫిబ్రవరి 19న మిర్చి రైతులు పరామర్శ కోసం జగన్ యార్డుకు వచ్చారు.



ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నా వైకాపా నేతలు అనుమతి లేకుండా వచ్చి హడావుడి చేశారు. మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో నడిచే యార్డులో జగన్ రాజకీయ ప్రసంగాలు చేశారు. ఈ నేపథ్యంలో జగన్తో పాటు నేతలు అంబటి రాంబాబు, లేళ్ల అప్పిరెడ్డి, కావటి మనోహర్నాయుడు, మోదుగుల వేణుగోపాల్రెడ్డి తదితరులపై కేసు నమోదైంది. ఇప్పటికే పోలీసులు వారికి 41ఏ నోటీసులు ఇచ్చారు. పిలిచినప్పుడు నల్లపాడు పీఎస్కు విచారణకు రావాలని సూచించారు. రెంటపాళ్ల పర్యటనలో సింగయ్య అనే వ్యక్తి మృతిపై ఇప్పటికే జగన్పై కేసు నమోదైన విషయం తెలిసిందే.

# రాబోయే రోజుల్లో సవాళ్లు ఎదుర్కొబోతున్నాం:రేవంత్ రెడ్డి

రాబోయే రోజుల్లో అనేక సవాళ్లు ఎదుర్కోబోతున్నామని సీఎం రేవంత్ రెడ్డి పార్టీ నేతలకు తెలిపారు.

**హైదరాబాద్, జూన్ 24, (రిపబ్లిక్ న్యూస్):** రాబోయే రోజుల్లో అనేక సవాళ్లు ఎదుర్కోబోతున్నామని సీఎం రేవంత్రెడ్డి పార్టీ నేతలకు తెలిపారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్, జమిలి ఎన్నికల వంటి అనేక అంశాలు రాబోతున్నట్లు చెప్పారు. పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో సీఎం మాట్లాడారు. త్వరలో మార్కెట్, టెంపుల్ కమిటీల్లో నామినేషన్ పోస్టులు భర్తీ చేయాలన్నారు.



జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం పార్టీని సిద్ధం చేయాలని చెప్పారు. "మరోసారి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేలా పని చేయాలి. బూత్, గ్రామ, మండలస్థాయిలో పార్టీ కమిటీలు ఏర్పాటు చేయాలి. పార్టీ కమిటీ నాయకులు క్షేత్రస్థాయిలో పని చేయాల్సిందే. పని చేస్తేనే పదవులు వస్తాయి. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పని చేసిన వారికి పదవులు ఇచ్చాం. లక్ష్యాలు నిర్దేశించుకొని పార్టీ నాయకులు పని చేయాలి. నేను గ్రామాల్లోకి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నాను. పార్టీ, ప్రభుత్వం సమన్వయంతో ముందుకెళ్తాయి" అని రేవంత్రెడ్డి తెలిపారు.

# సంక్షేమ కార్యక్రమాలకు రూ.95,351 కోట్లు ఖర్చు:భట్టి విక్రమార్క

రాష్ట్రంలో రూ.22వేల కోట్ల వ్యయంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు.

**హైదరాబాద్, జూన్ 24, (రిపబ్లిక్ న్యూస్):** రాష్ట్రంలో రూ.22 వేల కోట్ల వ్యయంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఒక్కో అసెంబ్లీ స్థానంలో 3వేల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. గాంధీభవన్లో ఆయన మీడియాతో మాట్లాడాతూ.. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. "రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రూ. 10లక్షల వరకు వైద్య సదుపాయం అందిస్తున్నాం. దీంతో 94లక్షల కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయి. రూ.6వేల కోట్ల విలువైన 189 కోట్లు ఉచిత బస్సు టికెట్లు ఇచ్చాం. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందజేస్తున్నాం. 93.7 లక్షల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం. సంక్షేమ కార్యక్రమాలకు రూ.95,351 కోట్లు ఖర్చు చేస్తున్నాం" అని చెప్పారు.



# అవన్నీ ఊహాగానాలే.. ఎయిరిండియా
## 'బ్లాక్ బాక్స్' అంశంపై రామ్మోహన్ నాయుడు క్లారిటీ

అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరిన ఎయిరిండియా విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కుప్పకూలడం వెనుక గల కారణాలను అన్వేషించేందుకు ఉన్నత స్థాయి దర్యాప్తు కొనసాగుతోంది.

**పుణె, జూన్ 24, (రిపబ్లిక్ న్యూస్):** అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమానం కుప్పకూలిన దుర్ఘటన యావత్ ప్రపంచాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరిన ఎయిరిండియా విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కుప్పకూలడం వెనుక గల కారణాలను అన్వేషించేందుకు ఉన్నత స్థాయి దర్యాప్తును అధికారులు కొనసాగిస్తున్నారు.



ప్రమాదానికి కొద్ది క్షణాల ముందు ఈ విమానంలో అసలేం జరిగిందో తెలుసుకోనేందుకు అందరి దృష్టి ఇప్పుడు 'బ్లాక్ బాక్స్' విశ్లేషణపై పడింది. ఈ నేపథ్యంలో బ్లాక్ బాక్సు విచారణ కోసం విదేశాలకు పంపించారంటూ జరుగుతోన్న ప్రచారాన్ని కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తోసిపుచ్చారు. అవన్నీ కేవలం ఊహాగానాలేనంటూ కొట్టిపారేశారు. ఫిక్కీ, కేంద్ర విమానయాన మంత్రిత్వశాఖ సంయుక్త ఆధ్వర్యంలో పుణెలో జరిగిన హెలికాప్టర్స్ అండ్ స్మాల్ ఎయిర్ క్రాఫ్ట్ సమ్మిట్ 2025 సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా బ్లాక్ బాక్సుల్ని విదేశాలకు పంపిస్తున్నారా? అని విలేకర్లు అడగ్గా.. "అవన్నీ కేవలం ఊహాగానాలే. బ్లాక్బాక్స్ భారత్లోనే ఉంది. దీన్ని ప్రస్తుతం ఎయిర్ క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో పరిశీలిస్తోంది" అని స్పష్టం చేశారు. ఎప్పటివరకు దీంట్లోని డేటాను పొందొచ్చని మరో ప్రశ్నకు స్పందిస్తూ.. 'ఇది చాలా సాంకేతికతతో కూడిన వ్యవహారం. ఏఏఐబీ దర్యాప్తు చేపట్టి మొత్తం ప్రక్రియను పరిశీలించనివ్వండి" అన్నారు. జూన్ 12న లండన్ వెళ్లేందుకు అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి టేకాఫ్ అయిన విమానం గాల్లోకి ఎగిరిన కాసేపటికే ఓ వైద్య కళాశాల వసతిగృహంపై కూలడం పెను విషాదం నింపింది. ఈ ఘటనలో 240 మంది ప్రయాణికులతో పాటు 270మంది ప్రాణాలు కోల్పోగా.. విమాన ప్రయాణికుల్లో ఒకే ఒక్కరు ప్రాణాలతో బయటపడ్డారు. ఈ క్రమంలో జూన్ 13న ఎయిరిండియా బోయింగ్ 787 -8 డ్రీమ్లైనర్ విమానం బ్లాక్ బాక్స్ ను అధికారులు ఘటనా స్థలంలో స్వాధీనం చేసుకున్నారు. బ్లాక్ బాక్స్ అనేది విమానంలో ఏం జరిగిందో అన్న సమాచారాన్ని రికార్డు చేసే ఓ చిన్న పరికరం. ఇది విమాన ప్రమాదాల దర్యాప్తులో దీన్ని డీకోడ్ చేయడం వల్ల విమాన ప్రమాదానికి కొన్ని క్షణాల ముందే ఏం జరిగిందో తెలుసుకొనేందుకు ఉపయోగపడుతుంది.

# జనం మరిచిపోతారనే జగన్ తంటాలు:షర్మిల

ఎన్నికల్లో వైకాపా ఓడిపోయాకే మాజీ సీఎం జగన్ ప్రజల్లోకి వస్తున్నారని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల అన్నారు.

**నెల్లూరు, జూన్ 24, (రిపబ్లిక్ న్యూస్):** ఎన్నికల్లో వైకాపా ఓడిపోయాకే మాజీ సీఎం జగన్ ప్రజల్లోకి వస్తున్నారని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల అన్నారు. ఉనికి కోసం బలప్రదర్శనలు చేస్తున్నారని.. జనం మరిచిపోతారనే ఈ తంటాలు పడుతున్నారని ఎద్దేవా చేశారు. నెల్లూరులో మీడియాతో షర్మిల మాట్లాడారు. "జగన్ వాహనం కింద పడి సింగయ్య అనే వ్యక్తి చనిపోవడం దురదృష్టకరం. జగన్ దీన్ని గమనించకపోవడం బాధాకరం. ఈ ఘటనను ఫేక్ అనడం తప్పు. మానవత్వం గురించి మాట్లాడే హక్కు ఆయనకు లేదు. ప్రజలను చంపుతున్నా జగన్ పర్యటనలకు ఎందుకు అనుమతి ఇస్తున్నారు? అసెంబ్లీ వేదికగా ఆయన పోరాటాలు చేయాలి. అక్కడికి వెళ్లే దమ్ములేకే బయట మాట్లాడుతున్నారు" అని షర్మిల విమర్శించారు.



# సికింద్రాబాద్ చరిత్రలో నిలిచిపోయేలా
## ఉజ్జయిని మహంకాళి బోనాలు:మంత్రి పొన్నం

సికింద్రాబాద్ చరిత్రలో నిలిచిపోయే విధంగా ఉజ్జయిని మహంకాళి బోనాల ఉత్సవాలు నిర్వహిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.



**హైదరాబాద్, జూన్ 24, (రిపబ్లిక్ న్యూస్):** సికింద్రాబాద్ చరిత్రలో నిలిచిపోయే విధంగా ఉజ్జయిని మహంకాళి బోనాల ఉత్సవాలు నిర్వహిస్తామని రవాణా శాఖ, హైదరాబాద్ జిల్లా ఇన్ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. జులై 13న ఉజ్జయిని మహంకాళి బోనాల నేపథ్యంలో అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆలయ ప్రాంగణంలో వివిధ శాఖలకు చెందిన అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. అన్ని శాఖల సమన్వయంతో ప్రజలందరి సహకారంతో బోనాల ఉత్సవాలను విజయవంతం చేయాలని మంత్రి కోరారు. రాజకీయాలకు అతీతంగా అమ్మవారి బోనాలు నిర్వహించుకోవాలన్నారు. గతేడాది ప్రభుత్వం తరపున భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఘనంగా బోనాలు నిర్వహించామని గుర్తు చేశారు. బోనాల ఉత్సవాల నేపథ్యంలో అమ్మవారి దర్శనానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బోనాలతో వచ్చే మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తూ, ప్రభుత్వ పరంగా అన్ని శాఖల అధికారులను సమాయత్తం చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో కలెక్టర్ హరిచందన, స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, దేవాదాయ శాఖ, జీహెచ్ఎంసీ, విద్యుత్, అగ్నిమాపక, జలమండలి అధికారులు పాల్గొన్నారు.

# బడి పిల్లలను ధర్నాకు తీసుకెళ్లిన
## వైకాపా మాజీ ఎమ్మెల్యే.. మంత్రి లోకేశ్ ఆగ్రహం

వైకాపాకు చెందిన పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే బడి పిల్లలను ధర్నాకు తీసుకెళ్లిన ఘటనపై విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

**అమరావతి, జూన్ 24, (రిపబ్లిక్ న్యూస్):** వైకాపాకు చెందిన పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే బడి పిల్లలను ధర్నాకు తీసుకెళ్లిన ఘటనపై విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్నా అనంతరం తిరిగి వస్తుండగా ప్రమాదంలో బడి పిల్లలు గాయపడ్డారని, వారిలో ఇద్దరి పరిస్థితి సీరియస్‌గా ఉందని శ్యామ్ అనే వ్యక్తి 'ఎక్స్' ద్వారా మంత్రి లోకేశ్ దృష్టికి తెచ్చారు. ఎంఈవో, హెచ్ఎంపై చర్యలు తీసుకోవాలని కోరారు. శ్యామ్ ఫిర్యాదుపై మంత్రి స్పందించారు. "ఇది చాలా దారుణం, నేరం. అత్యవసరంగా విచారించి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించా. గాయపడిన పిల్లలు, తల్లిదండ్రులకు మెరుగైన చికిత్స అందిస్తాం. పాఠశాలల్లో దురదృష్టకరమైన ఈ జోక్యం రాజకీయ పార్టీల నేతలు, అధికారులకు హెచ్చరిక కావాలి. ఏ రాజకీయ పార్టీ అయినా దయచేసి మీ స్వప్రయోజనాల కోసం పాఠశాలల జోలికి పోవద్దు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోవద్దు. బాధ్యులపై కఠినంగా వ్యవహరిస్తాం" అని మంత్రి లోకేశ్ పోస్ట్ చేశారు.




printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్



## చరిత్రలో నేటి ప్రత్యేకత

- **1902:** సినిమా దర్శకుడు, సంపాదకుడు గూడవల్లి రామబ్రహ్మం జననం (మ.1946).
- **1915:** తెలుగు రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాలగుమ్మి పద్మరాజు జననం (మ.1983).
- **1927:** తమిళ కవి, భావకవి కన్నదాసన్ జననం (మ.1981).
- **1963:** భారత తంతి తపాళా శాఖవారు టెలెక్స్ సేవలను ప్రారంభించారు.
- **1966:** దక్షిణ భారత సినిమా నటి విజయశాంతి జననం. (చిత్రంలో)



గూడవల్లి రామబ్రహ్మం



పాలగుమ్మి పద్మరాజు



కన్నదాసన్




భారత తంతి తపాళా శాఖ



విజయశాంతి

రిపబ్లిక్ స్పోర్ట్స్

# లీడ్స్ టెస్ట్‌లో కచ్చితంగా ఫలితం తెలుతుంది:కేఎల్ రాహుల్

లీడ్స్‌లోని హెడింగ్లీ వేదికగా ఇంగ్లాండ్, టీమ్ ఇండియా మధ్య జరుగుతున్న మొదటి టెస్ట్ మ్యాచ్లో కచ్చితంగా ఫలితం తెలుతుందని కేఎల్ రాహుల్ అన్నాడు.




లీడ్స్ లోని హెడింగ్లీ వేదికగా ఇంగ్లాండ్, టీమ్ ఇండియా జట్ల మధ్య మొదటి టెస్ట్ మ్యాచ్ జరుగుతోంది. ఈ పోరు దాదాపు ముగింపునకు చేరుకుంది. ఈ మ్యాచ్లో కచ్చితంగా ఫలితం తేలుతుందని నాలుగో రోజు ఆట ముగిసిన తర్వాత కేఎల్ రాహుల్ అన్నాడు. అలాగే జట్టులో తనకు విభిన్న బాధ్యతలు, పాత్రలు ఇవ్వడం సంతోషంగా ఉందన్నాడు. తనకు సరిపోయే బ్యాటింగ్ ఆర్డర్ ఏంటో తిరిగి తెలుసుకున్నందుకు ఆనందంగా ఉందన్నాడు. 'రెండు సంవత్సరాలుగా, బ్యాటింగ్ ఆర్డర్లో నా స్థానం ఏంటి? నాకు ఏది సౌకర్యంగా ఉందో.. నేను మర్చిపోయాను! నాకు విభిన్న బాధ్యతలు, పాత్రలు ఇవ్వడం సంతోషంగా ఉంది. ఇది నాలో చాలా ఉత్తేజం నింపింది. నాకు నేను సవాలు విసురుకోవడానికి సాయపడింది. నన్ను మరింత రాటుదేలేలా చేసింది. నేను ఈ ప్రయాణాన్ని ఆస్వాదించాను' అని నాలుగో రోజు ఆట ముగిసిన అనంతరం కేఎల్ రాహుల్ అన్నాడు. అలాగే మొదటి టెస్ట్ మ్యాచ్ చివరిరోజు కచ్చితంగా ఫలితం తేలుతుందని అతడు ఆశాభావం వ్యక్తంచేశాడు. భారత బౌలర్లు ఇంగ్లాండ్ను ఆలౌట్ చేసి, సిరీస్లో 1-0 ఆధిక్యం సాధిస్తారని విశ్వాసం వ్యక్తంచేశాడు. 'మొదటి టెస్ట్ మ్యాచ్కు బ్లాక్ బస్టర్ ముగింపు రానుంది. కచ్చితంగా ఫలితం తేలుతుంది. ఇంగ్లాండ్ వాళ్లూ ఈ విషయాన్ని చెప్పారు. మా బౌలర్లు 10 వికెట్లు తీసుకొని టీమ్ ఇండియాకు విజయాన్ని అందిస్తారు' అని కేఎల్ రాహుల్ విశ్లేషించాడు. భారత జట్టు రెండో ఇన్నింగ్స్‌లో కేఎల్ రాహుల్ 137 పరుగులు చేశాడు. రిషబ్ పంత్ (115)తో కలిసి నాలుగో వికెట్కు 195 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఈ ఇద్దరు బ్యాటర్లు రాణించడంతో టీమ్ ఇండియా.. ఇంగ్లాండ్ ముందు 371 పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచగలిగింది. నాలుగో రోజు చివర్లో 6 ఓవర్లు బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ 21 పరుగులు చేసింది. మరో 350 పరుగులు వెనకబడి ఉంది.

అల్లు అర్జున్ - అట్లీ మూవీ..

# వైరలవుతోన్న లేటెస్ట్ అప్డేట్

అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో రానున్న సినిమాకు సంబంధించిన వార్తలు నెట్టింట వైరల్ అవుతున్నాయి..



అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో ఓ సినిమా రానున్న విషయం తెలిసిందే. ఈ భారీ ప్రాజెక్టు సంబంధించిన వార్తలు ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతూనే ఉన్నాయి. తాజాగా దీనికి సంబంధించిన కొన్ని విషయాలు నెట్టింట వైరల్ గా మారాయి. ఈ షూటింగ్ అప్డేట్లను అభిమానులు షేర్ చేస్తున్నారు. ఇప్పటికీ దీని ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ వర్క్ తర్వాత ఈ చిత్రం షూటింగ్ కు సన్నద్ధం కానుంది. ఇందులో భాగంగానే తొలి షెడ్యూల్ను ముంబయిలో చిత్రీకరించనున్నారట. మూడు నెలల పాటు అక్కడే షూటింగ్ చేయనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇందులో యాక్షన్ సన్నివేశాలు తీయనున్నారట. ఈ షెడ్యూల్ తర్వాత వీఎఫ్ఎక్స్ పనులను ప్రారంభించనున్నట్లు టాక్. దీనికోసం టీమ్ మొత్తం అమెరికా వెళ్లనుందని సమాచారం. అయితే దీనిపై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు.సన్ పిక్చర్స్ నిర్మాణసంస్థపై భారీ బడ్జెట్తో ఇది రూపొందనుంది. బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకొణె.. ఇందులో బన్నీకి జోడీగా కనిపించనున్నారు. సమాంతర ప్రపంచం, పునర్జన్మల కాన్సెప్ట్తో ముడిపడి ఉండే సైన్స్ఫిక్షన్ సినిమాగా ఇది ముస్తాబు కానున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీనికోసం చిత్రబృందం ఓ కొత్త ప్రపంచాన్ని సృష్టించే పనిలో ఉంది.

## చిన్న విషయాలే కావచ్చు.. జీవితమంతా గుర్తుంటాయి:రష్మిక

తన కోస్టార్ ధనుష్పై రష్మిక ప్రశంసలు కురిపించారు. సోషల్ మీడియా వేదికగా ఓ సెల్ఫీ పోస్ట్ చేశారు.





'కుబేర'తో మరో హిట్ను తన ఖాతాలో వేసుకున్నారు రష్మిక. శేఖర్ కమ్ముల దర్శకత్వం వహించిన ఈ సినిమాలో సమీరా పాత్రలో తన నటనతో ఆకట్టుకున్నారామె. తాజాగా ఈ చిత్రంలో తన కోస్టార్ ధనుష్ పై ఆమె ప్రశంసలు కురిపించారు. ఆయన సింప్లిసిటీని గురించి వివరిస్తూ సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. "మీతో అంత పెద్ద సినిమా చేసినప్పటికీ మనిద్దరిది ఒక్క సెల్ఫీ మాత్రమే ఉంది. మీరు అద్భుతమైన వ్యక్తి. మనం మట్లాడుకున్న ప్రతిసారీ వేర్వేరు నగరాల్లో ఉన్నాం. ఇద్దరం వేర్వేరు పనులు చేసుకుంటూ మాట్లాడుకునేవాళ్లం. విశ్రాంతి ఎంత ముఖ్యమో చర్చించేవాళ్లం. కానీ, విశ్రాంతి మాత్రం తీసుకోలేదు. కుబేర నటనపరంగానే కాదు.. నిజ జీవితంలోనూ మీరు చేసే పనులు ఎంతోమందికి ఆదర్శం. చుట్టూ ఉన్నవారితోనూ ఎంతో మర్యాదపూర్వకంగా నడుచుకుంటారు. ముఖ్యంగా మీరు సెట్ లో నాకోసం తెచ్చిన లడ్డులను ఎప్పటికీ గుర్తుంచుకుంటాను. నాకు తమిళ డైలాగుల్లో మీరు చేసిన సాయం.. నేను ఏదైనా డైలాగు చెప్పినప్పుడు మీరు ప్రశంసించిన తీరు. ఇవన్నీ చిన్నచిన్న విషయాలే కావచ్చు.. కానీ, జీవితమంతా గుర్తుంటాయి" అంటూ ధనుష్ దిగిన సెల్ఫీని షేర్ చేశారు. ధనుష్, నాగార్జున ప్రధాన పాత్రల్లో శేఖర్ కమ్ముల తెరకెక్కించిన క్రైమ్ డ్రామా 'కుబేర'. ధనవంతుల అత్యాశకు, పేదవాళ్ల ఆకలికి మధ్య జరిగే సంఘర్షణకు దృశ్య రూపంగా ప్రేక్షకుల ముందుకువచ్చి విమర్శకుల ప్రశంసలు అందుకుంటోంది.

రిపబ్లిక్ సినిమా CINEMA

# డ్రగ్స్ కేసు.. శ్రీరామ్కు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ..

డ్రగ్స్ కేసులో అరెస్టైయిన శ్రీరామ్‌కు కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది.



డ్రగ్స్ కేసులో అరెస్టు నటుడు శ్రీకాంత్ అలియాస్ శ్రీరామ్ను చెన్నై పోలీసులు చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఈ కేసుపై పోలీసులు ఎనిమిది గంటల పాటు సుదీర్ఘ విచారణ జరిపారు. అనంతరం చెన్నై కోర్టులో హాజరుపరిచారు. కేసును విచారించిన న్యాయస్థానం అతడికి 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. విచారణ సమయంలో నటుడు శ్రీకాంత్కు మాదక ద్రవ్యాల నెట్వర్క్ లో ప్రమేయం ఉన్నట్లు పోలీసులు ఆధారాలు గుర్తించి వివరాలు సేకరించినట్లు తెలుస్తోంది. చెన్నై నుంగంబాక్కంలో గత నెల ఓ బార్లో చోటుచేసుకున్న ఘర్షణకు సంబంధించి మైలాపూర్కు చెందిన అన్నాడీఎంకే నాయకులు ప్రసాద్, అజయ్ వాండైయార్తో పాటు పలువురిని పోలీసులు సోమవారం అరెస్టు చేసి విచారించారు. వీరు మత్తు పదార్థాలు వాడినట్లు ఫిర్యాదులు రావడంతో ఎవరి నుంచి కొనుగోలు చేశారని, ఎవరెవరికి సరఫరా చేశారని పోలీసులు ఆరా తీశారు. వారు ఇచ్చిన సమాచారం మేరకు కొకైన్ సరఫరా కేసులో అరెస్టయిన ప్రదీప్కుమార్ను విచారించారు. ప్రదీప్ ద్వారా ప్రసాద్.. నటుడు శ్రీకాంత్కు మత్తుపదార్థాలు సరఫరా చేసినట్లు తెలిసింది. అతడి నుంచి శ్రీకాంత్ కొకైన్ కొనుగోలు చేశారని, దానికి సంబంధించి నగదును ఆన్లైన్లో చెల్లించారని దర్యాప్తులో వెల్లడైంది. ఈ విషయమై నుంగంబాక్కం పోలీసులు సోమవారం శ్రీకాంతు పోలీస్ స్టేషన్కు తీసుకెళ్లారు. అనంతరం రక్త నమూనాలను ల్యాబ్కు పంపించగా.. మత్తు పదార్థాలు ఉపయోగించినట్లు నిర్ధరణ అయింది. దాంతో వారు శ్రీరామ్ను అరెస్టు చేశారు. 'రోజాపూలు' సినిమాతో తెలుగులో మంచి గుర్తింపు పొందారు శ్రీరామ్. 'ఒకరికి ఒకరు', 'ఆడవారి మాటలకు అర్థాలు వేరులే' 'మస్కా', 'రామ రామ కృష్ణ కృష్ణ', 'కందిరీగ', 'భలే మంచిరోజు' వంటి చిత్రాల్లో నటించారు. అలాగే 'హరికథ' వెబ్సిరీస్లో కీలక పాత్రలు పోషించారు.

ప్రజా రిపబ్లిక్ దిన పత్రిక
9948814188, 9985876888
ప్రకటన
ప్రజా సమస్యల పై అనునిత్యం ప్రజా గళాన్ని అక్షర సత్యాలతో కూడిన సంచలన వరుస కథనాలను అందిస్తూ దూసుకెళ్తున్న ప్రజా రిపబ్లిక్ దినపత్రికకు రెండు తెలుగు రాష్ట్రాలలో తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ జిల్లాలలో, నియోజకవర్గాలలో స్టాఫ్ రిపోర్టర్లు, పాత్రికేయులు, మండలాల నందు పాత్రికేయులు కావలెను. ప్రజల పక్షాన నిలుస్తూ సమస్యల పరిష్కారానికి అక్షర పోరాటం చేయడానికి మాతో కలిసి పని చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు కర్నూలు మరియు నంద్యాలలోని మా కార్యాలయముల నందు లేదా ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.
ప్రజా రిపబ్లిక్ దినపత్రిక కార్యాలయం, షాప్ నెం: 26, మొదటి అంతస్తు, శ్రీనివాస కాంప్లెక్స్, శ్రీనిధి టిఫిన్ సెంటర్ ఎదురుగా, నంద్యాల - 518501
డోర్ నెం:46/181/బి-1, మనోజ్ టాలెంట్ స్కూల్ దగ్గర, బుధవార పేట, కర్నూలు - 518001
బొజ్జ నాగేంద్ర
ఎడిటర్ & మేనేజింగ్ డైరెక్టర్

## ఇంటిచిట్కాలు

## చేతులకి ఉన్న మెహందీ త్వరగా పోవాలా, కొన్ని టిప్స్ ఫాలో అయితే చాలు


### క్షణాల్లో గోరింటాకు తాలుకూ మచ్చలు మొత్తం మాయం

పండుగలు, శుభకార్యాలు.. ఇలా ఏ వేడుకైనా సరే చేతుల నిండుగా మెహందీ వేసుకుంటారు. దీంతోనే చేతులకి అసలైన కళ వస్తుంది. అకేషన్స్ తర్వాత మెహందీ మొత్తం పోవడానికి టైమ్ పడుతుంది. కానీ, ఆలోపు ఆఫీసులో పంచ్ చేయడానికి, లేదా కొన్ని కాలేజెస్, స్కూల్స్‌లో మెహందీని అలో చేయరు. అలాంటప్పుడు త్వరగా దీనిని ఎలా పోగొట్టుకోవాలో తెలుసుకోండి.

మెహందీ చేతులకి అందంగా కనిపిస్తుంది. అయితే, మెహందీ పెట్టిన వెంటనే బానే ఉంటుంది. కానీ, కొన్నిసార్లు దానిని వెంటనే తీసేయాల్సి ఉంటుంది. ఎందుకంటే, కొన్ని ఆఫీసులు, స్కూల్స్, కాలేజీలకి మెహందీ ఉంటే పర్మిషన్ ఉండదు. అంతేకాకుండా, కొద్దిగా ఫేడ్ ఔట్ అయిన మెహందీ కూడా అందరికీ ఇష్టం ఉండదు. దీంతో మెహందీని పోగొట్టుకోవాలనుకుంటారు. దానికోసం ఏం చేయాలని ఆలోచిస్తున్నారా.. కొన్ని ట్రిక్స్ ఫాలో అవ్వండి.



### బేకింగ్ సోడా




బేకింగ్ సోడా ఎక్స్‌ఫోలియేటింగ్ గుణాలు కలిగిన పదార్థం. అరకప్పు నిమ్మరసంలో 2 నుంచి 3 టీస్పూన్ల బేకింగ్ సోడా వేయండి. చక్కగా పేస్టులా చేయండి. దీనిని మెహందీపై ఉంచండి. 15 నిమిషాల పాటు అలానే ఉంచండి. తర్వాత దీనిని స్క్రబ్ చేస్తూ రబ్ చేయండి. తర్వాత గోరువెచ్చని నీటితో కడగండి. దీంతో మెహందీ మరకలన్నీ పోతాయి. ఇదంతా అయ్యాక చేతులకి మాయిశ్చరైజర్ రాయడం మరువొద్దు. లేదంటే చేతులు డ్రైగా మారతాయి.

### ఉప్పు నీరు



ఉప్పు నీరు కూడా మెహందీని ఈజీగా పోగొడుతుంది. దీనికోసం బకెట్ గోరువెచ్చని నీటిలో 5 టీ స్పూన్ల ఉప్పువేయాలి. అందులో చేతులని ఉంచాలి. చేతుల్ని మార్చి మార్చి అందులో ఉంచాలి. కాళ్లకి ఉంటే కాళ్లని కూడా పెట్టొచ్చు. 20 నిమిషాల తర్వాత బయటికి తీసి రబ్ చేయాలి. చాలా వరకూ మెహందీ పోతుంది. తర్వాత మాయిశ్చరైజర్ రాయాలి.

### షుగర్ స్క్రబ్, కొబ్బరినూనె




పంచదారలో కొద్దిగా కొబ్బరినూనెని కలపండి. దీనిని బాగా మిక్స్ చేసి చేతులకి రాయండి. దీనికోసం 2 టేబుల్ స్పూన్ల పంచదారలో 1 టీ స్పూన్ కొబ్బరినూనె కలిపి రాయండి. ఇది చక్కని స్కిన్ ఎక్స్‌ఫోలియేటర్ అని చెప్పొచ్చు. ఈ మిశ్రమాన్ని చేతులు, పాదాలకి రాయండి. మెల్లిగా మసాజ్ చేయండి. మెహందీ ఉన్నచోట ఎక్కువగా రాయండి. తర్వాత చేతుల్ని గోరువెచ్చని నీటితో కడిగి క్రీమ్ బేస్డ్ మాయిశ్చరైజర్, బాడీ ఆయిల్ రాయండి.

### టమాట రసం




టమటరసంలో సిట్రిక్ యాసిడ్ ఉంటుంది. ఇది నేచురల్ ఎక్స్‌ఫోలియెంట్‌లా పనిచేస్తుంది. హెన్నా డైని బ్రేక్ చేయడానికి హెల్ప్ చేస్తుంది. బాగా పండిన టమాట నుండి రసం తీయండి. దీనిని మెహందీ ఉన్న చోట రాయండి. ఆ తర్వాత కొన్ని చుక్కల నిమ్మరసం కూడా వేయండి. రెండు చేతులతో దీనిని బాగా రుద్దండి. మెహందీ మొత్తం పోయేవరకూ దీనిని రిపీట్ చేయండి. చేతులని కడిగి ఆ తర్వాత మాయిశ్చరైజర్ రాయండి.

### హెయిర్ కండీషనర్



హెయిర్ కండీషనర్‌లో కొద్దిగా కెమికల్ గుణాలు ఉంటాయి. ఇవి హెన్నా కలర్‌ని తగ్గిస్తాయి. దీనికోసం కొద్దిగా హెయిర్ కండీషనర్ తీసుకుని చేతులకి రాయాలి. తర్వాత రబ్ చేయాలి. 15 నిమిషాల పాటు ఉంచి తర్వాత నీటితో కడగాలి. చివర్లో మాయిశ్చరైజర్ రాయాలి.



**గమనిక:** ఇది సాధారణ సమాచారం కోసం మాత్రమే. ఇది ఏ విధంగానూ ఏ మెడిసిన్ లేదా చికిత్సకు ప్రత్యామ్నాయం కాదు. వీటిని పాటించేముందు మరింత సమాచారం కోసం ఎల్లప్పుడూ మీ వైద్యుడిని సంప్రదించండి.

